స్కెచ్ :-

# అత్తగారి స్వగతం

"జయరావ్"

ఈ ఎంగిలి మంగలాన్ని చూస్తూ ఎన్నాళ్ళు బ్రతికమంటావురా దేవుడా! కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. ఈ సంబంధం మరొద్దురా నాయనా అని నెత్తిన నోరెట్టుకుని చెప్పినా నామాట వింటేనా? చక్కని చుక్కనీ, చదువుకున్నదని మావాడు మురిసి బోర్లా బడ్డాడు, సౌందర్యం సౌడిభ్యం వెలిగిస్తోంది— చవిటీల వెలుగు!

సంసార ప్పడుచుకి సౌందర్య మెందుకే కాల్చుకుతిననా? చదివింకంత చదువు, చాకలి పద్దుల చదువు. ఆడదానికి చదువెందుకు ఊళ్ళేలనా, ఉద్యోగాలుచెయ్యనా? మా తమ్ముడి కూతురు లక్ష్మీదేవి లాంటిపిల్ల. నిప్పును కడిగి నీళ్ళుజల్లే సంప్రదాయం! ఈడూ జోడూ చక్కగావుందని శతవిధాల పోరినా మావాడు విన్నాడూ? ఎందుకు వింటాడు, యీ పెద్దమ్మ రాసిపెట్టి వుంటే? — ఇంతకీ మన బంగారం మంచిదయితే సాగదీసి పానపట్టనూ?

అది ఎట్లా ఆడిస్తే వాడల్లా ఆడతాడు. మావాడు వుత్త బోళామనిషి. ఆడదాని జిత్తులు వాడికేం తెలుస్తాయి. ముచ్చట ముచ్చటగా నెత్తికెక్కించుకుని, యిప్పుడు మొయ్యలేక దిగమంటే దిగుతుందా యీ రంగమ్మతల్లి!

మొక్కయి లేనిది మానయి వంగుతుందా? అపుడపుడు ఎడా పెడా అణసరిస్తుంటేనే అణిగి మణిగుంటుంది. రవంత పగ్గాలొదులయితే - యింకేముంది? - గణాచారిలా రచ్చకెక్కుతుంది.

ఆదేం పేరమ్మా! ... మహిళా మండలిట. మండి మసిగాను, అస్తమానం మా రాణీగారు అక్కడే అఘోరిస్తే, యింట్లో నీళ్ళూ నిప్పులూ చూసుకునే దెవరో?

అటున్న చెంబిటు పెడితే అలసట. ఆ నాలుగు మెతుకులూ కత కత మనిపించటమే చేతకాకపోతే ఎలాగో? అంత సుతిమెత్తని ఆడది వంటలక్కని పెట్టమని మొగుడుకు చెప్పకూడదూ? అవునులే, ఎందుకు చెబుతుంది? జీతం బత్తెం లేకుండా చాకిరీ చెయ్యటానికి - ఆయొయ్యా నా అదృష్టంమీద అటుకులుజల్లా!- నేనుండగా మరో వంటలక్కతో పనేముంది గనక?—

దూడ తాగినట్టూ లేదు, దుత్త నిండినట్టూ లేదు ముష్టొద్దులా ఏం కాఫీలివి? కడుపు నిండనా, కాలునిండనా? లేస్తూనే కాఫీ కప్పులు గలగల లాడవలసిందే! ఆదేం కడుపా, చెరువా? విస్తరి ముందు కూర్చుని రుచీ పచీ లేదని రుసరుసలు.

ఇంట్లో ఎప్పుడు చూసినా రద్దీ బద్దీ రావణా యుద్ధం. నువ్వెంతంటే నువ్వెంత, నేనేమన్నా నోరుమెదిపానా "యీ అత్తముండ మంచిది కాదో" అని ఊరూ నాడూ ఏకంచేసి పెడుతుంది అత్తలేని కోడలు ఉత్తమురాలు. ఎంత రాసుకుని తిరిగినా, చూసిన కళ్ళు శూలాలు, అత్త కళ్ళు పేలాలు, రాచి రంపాన పెడుతున్నానని యిరుగమ్మలతో పొరుగమ్మలతో చాడీలు, ఇది యిలా అడ్డమయిన వాళ్ళతోటి కచేరీచేసి, సంసారాన్ని చాకిరేవు కీడ్వటం ఏంసబబు? ఇంతకీ నరునిదేముంది, అంతా నారాయణమూర్తి నాటకం!

మగవాణ్ణి పేరుతో పిలవటమే! అవ్వ! ఏం విడ్డూరాలో? తన తాతలనాడు చూసిందా, తండ్రులనాడు చూసిందా? దానికి తోడు వీడూ అంతేనా? మగవాడు ఏదో ముచ్చటపడి పిలిచాడే అనుకో, తనూ వాణ్ణి పేరుతో పిలవటమా?

సిగ్గు లేకపోతేసరి. మన కాలంలో యిట్లా వుండేదా? పొద్దూపోలూ, ఆదేంటో పవుడరట పాడుగాను, గోడకి సున్నం మెత్తినట్టు అంగుళం మందాన్ని మొగానికి మలామా చెయ్యకపోతే పసుపు పూసుకోరాదూ! కడుపు కూటికేడిస్తే, కొప్పు పువ్వుల కేడ్చిందని సామెత వీళ్ళకే?— నాజూగ్గా ఒక్క పువ్వు దోపుకుంటే సరిపోతుందట.

మా కాలంలో పట్టెడు పసుపు పూసుకుని, గుండెడు ఉతకాల్లో స్నానంచేసి పట్టుచీర కట్టుకుని, కొంగ్గాటంచు రైక తొడుక్కుంటే మాలచ్చిలా గున్నావని మురిసిపోయే వారాయన మరి వీళ్ళు గంగిరెద్దుల్లాగ అన్ని గంతలూ బొంతలూ ఒకదాని మీదొకటి దిగేసుకుంటే సరా! అన్నీ కోతివేషాలు, కొంగ నడకలూను!

ఆ పిచ్చమ్మగారి బుచ్చమ్మకేం పొయ్యే కాలం వచ్చింది? అదీ మహిళా మండలిలో జేరిందట! పనీ పాట లేక పోతే సరి, మా కోడలు సరే లోకాన్నుద్ధరిస్తోంది. దానికేం వచ్చిందో! అరవయ్యేళ్ళు వంటిమీదికొచ్చినా అడ్డాల బాటలాగ తిరగాలంటుంది, ముసలి ముప్పున రామా కృష్ణా అనుకోకుండా యిదేం బుద్ధో?

కలికాలం కాలిపోతున్నది, దున్నపోతంత ఆడదానికి, పుస్తెకూడా బరువయితే పురుషుడెందుకూ అంట! మనిషై పుట్టాక సిగ్గూ, శరమూ ఉంటేనా? అంతా అపుతున్నదిటలే అవిడెవతో. దాని కడుపుడకా, కట్టుకున్న వాడక్కర్లేదని కచేరీ కెక్కిందట! అది ఆడదా, గాడిదా? నారాయణమూర్తీ, ఏం చెప్పను తండ్రీ నీలీలలు!

అదేం ఆడపుట్టుకో! తను మంచం దిగువని చిరుచాపేసుకుని పడుకోరాదూ? మగవాడితోపాటు తనకీ దిండూ, దివానం కావాలే? పట్టుపానుపు తప్పితే రాణీగారికి కునుకు పడుతుందా?

ఛీ ఛీ! — కించిత్తయినా సిగ్గూఎగ్గూ ఉంటేనా? ఎప్పుడూ ఒక్కటే నవ్వులు, వేళా పాళా వుండక్కర్లా సరసాలకి, ఎల్లకాలమూ ఎదురు బదురుగా చేరి సరసాలాడటానికి యిదేం సానికొంపా, సన్నాసిమఠమా? పైగా వాడింటికి పెందరాళే రాలేదని రాణీగారి పితూరీ పదిమందిలో తిరగేమగాడికి చక్కబెట్టుకోవా

లసిగవి సహా లక్షపనులుంటాయి చేస్తున్నది. సర్కారు కొలువాయె, ఇంటా బయటా ఎన్నో కార్యాలు నిర్వాకం చెయ్యాలాయెను. ఎప్పుడింటికి వస్తే దీనికెందుకు యీ పేచుపెత్తనం? ఆకాసేపూ అయ్యగారికీ అమ్మగారికీ ఎడమొలం, పెడమొగం. ఇంతకీ తనను సినిమాకు తీసికెళ్ళ లేదనేగా దానిఏడుపు!

పిల్ల కట్టుతప్పి కూర్చుందా! రేపో ఎల్లుండో అల్లుడిని తీసుకు రావాలికదా! ఆడది ఆవిషయం మొగాడితో అనకపోతే మొగాడికేం తెలుస్తాయి యీ ఆడవాళ్ళ గొడవలు.

ఇన్ని చూస్తూవుండేకంటె ఊరిపోసుకొంటే బాగుండు అనిపిస్తోంది ఇంటిగుట్టూ రోగంట్టూ అన్నారు, ఎవరితో చెప్ప ఏం లాభంటే!

- ఈ నరకకూపంలో ఎన్నాళ్ళు వేగాలిరా వెంకటరమణా! 15 b1 15 b1

## కోరమీసాలు

(22 వ పేజీ తరువాయి)

మాత్రం స్నేహితురాండ్రతోని, చెలికత్తెలతోనూ తిరగరాదు, సరదాగా ఉండరాదని; అంతేనా'' అంది నవ్వుతూ మళ్ళీ నవ్వుతూనే కథ యిలా పూర్తిచేసింది. ఈ ఫోటో మేము, కాలేజీలో నాటకం ఆడిననాటి రోజులది. ఇందులో నేను రాజకుమార్తెను. మా సరళపిన్ని రాజకుమారుడున్నూ "ఆవిడికి నీ ఫోటో యింత చేసిందని వ్రాస్తానులెండి" అని అమాంతంగా ఆమె చేతుల్లోంచి ఫోటో ఊడబెరికి, ఆ వొదినగారు మీసాలరాయుడు ఫోటోనుచూసి, తెల్లబోతూ, "అయ్యో, మరదీ, కళ్ళజోడుండి మోసపోయావా? ఎంత మతిమాలినవాడివి!'' అంది.

వర్మమహాశయుడు ఏదో పనివున్నట్లు తటాలున బయటకు నడక సాగించేడు.

ఈ అర్జెంటు తంతివార్త తెలిసి అల్లుడికేమయిందో అని పిన్నత్త సరళకూడా సమయానికే వస్తూ అతని కెదురై "ఏమయింది?" అంది, ఇటు శ్రీమతి. అటు కోరమీసాల పిన్నత్తగారు. అయితే యిప్పుడు మీసాలున్నవో, లేవో!

అంతా ప్రశాంతం.

# "శలవు - శలవు"

శలవు, జగన్మాతా, శలవు, శలవు,
సూర్య చంద్రుల్లా - స్థిరంగా,
చుక్కల్లా - చిరకాలం
ఆరోగ్య, ఐశ్వర్యాల తో,
తులతూగుతూ, బ్రతకాలని,
"భ్రమించా" "భ్రాంతించా" —
చిన్ననాడు,

"కుహు," "కుహు'' -
కోయిల పాటలు.
పాడించేయి పసందు పాటలు.
శరత్కాలపు చంద్రుని చూపులు.
ఆడించేయి అందాల ఆటలు.
ముద్దులమితారి ముగ్ధ మాటలు
మేనునే మైమర పించాయి —
స్వర్గాన్నే సృష్టించాయి.
క్షణాలో కరువయ్యాయి-
యవ్వనపు రోజులు,
శలవమ్మా - జగన్మాతా -
శలవు - శలవు.

జీవించే - ఆశించుచు,
జయించుచు నిరాశను,
చాలీ చాలని జీతాలతో,
ఇంటిదానిని, ఈసడింపులతో,
పిల్ల జల్లల పట్టుదలలు,
పెంకితనాల తో—

అడ్డంకుల ఆవలకు త్రోలుచు,
కదలించా - కర్మచారిగా -
గృహస్థాశ్రమం,
శలవమ్మా - జగన్మాతా -
శలవు, శలవు.

భయపడుచున్నది -
బొందిలో ప్రాణం,
అలము కొనుచున్నది -
నిబిడ నిబిడాంధకారము,
అంతమగు చున్నది "జ్యోతి"—
"అంతర్ జ్యోతి,"
మూలుగుచున్న ముసలిప్రాణం
''తుదిపలుకు" పాడింది.
అమ్మా - జగన్మాతా -
శలవు, శలవు.

''సకల కల్యాణము,
నిరంతర లక్ష్మీనివాసము,
పరమ పావనము,
పరమేశ్వర పాదయుగళంబుల
పొంతకు పయనమై పోయెద—''
శలవమ్మా - జగన్మాతా -
శలవు, శలవు.

రచన: వి విశ్వనాథం